క్లుప్తంగా

జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా సర్వేశ్వర్‌రెడ్డి



షాద్‌నగర్: షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా సర్వేశ్వర్‌రెడ్డిని నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ పని చేసిన ప్రిన్సిపాల్ ఖురేసియా బేగం హైదరాబాద్ నాంపల్లిలోని మహబూబియా జూనియర్ కళాశాలకు బదిలీపై వెళ్లింది. ఈ సందర్భంగా శనివారం ప్రిన్సిపాల్ సర్వేశ్వర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. కళాశాల అధ్యాపకులు, సిబ్బంది ఆయనను ఘనంగా సన్మానించి, స్వాగతం పలికారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు అన్ని మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానన్నారు.

నియామకం



మల్లేశ్‌గౌడ్‌కు నియామకపత్రం అందజేస్తున్న నేతలు

మొయినాబాద్: గౌడ కుల హక్కుల పరిరక్షణ సమితి చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షుడిగా మండల పరిధిలోని శ్రీరాంనగర్ గ్రామానికి చెందిన కొకుంట్ల మల్లేశ్‌గౌడ్ నియమితులయ్యారు. ఈ మేరకు పరిరక్షణ సమితి జాతీయ ప్రధాన కార్యదర్శి నక్క మహేందర్‌గౌడ్, జిల్లా అధ్యక్షుడు రేనట్ల మల్లేశ్‌గౌడ్ ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్షుడిగా నియమితులైన కొకుంట్ల మల్లేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. గౌడ కుల సంఘాల అభివృద్ధితోపాటు హక్కుల పరిరక్షణ కోసం పనిచేస్తానన్నారు.

సర్వేయర్ లేకపోడంతో ఇబ్బంది



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

కేశంపేట: మండలంలో సర్వేయర్ అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ నాయకులు నరేందర్‌రెడ్డి, మహేశ్‌కుమార్, పరేశ్, శ్రీను, రాములు శనివారం తహసీల్దార్ అజీం అలీకి వినతిపత్రం అందించారు. మండలంలో విధులు నిర్వహిస్తున్న సర్వేయర్ వెంకటేశ్ రైతుల ఫోన్‌లను లిఫ్ట్ చేయడం లేదని, కార్యాలయంలో కూడా అందుబాటులో లేకపోవడంతో భూముల సర్వేకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని బీజేపీ నాయకులు తెలిపారు. సర్వేయర్ అందుబాటులో లేకపోవడంతో రైతులు లోన్‌లు, ఇతర పనులకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు.

రాబోయేది బీజేపీ ప్రభుత్వమే

నియోజకవర్గ యూత్ నాయకుడు వైభవ్‌రెడ్డి

చేవెళ్ల: రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని పార్టీలో పనిచేసే బూత్‌స్థాయి కార్యకర్తలకు మంచి అవకాశాలు వస్తాయని నియోజకవర్గ యువ నాయకుడు డాక్టర్ మాల్గారి వైభవ్ రెడ్డి అన్నారు. చేవెళ్లలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం తీరు చూస్తే ఈ ప్రభుత్వం ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిందని అర్థమైపోయిందన్నారు. పార్టీలో పనిచేసే బూత్‌స్థాయి కార్యకర్త నుంచి పైస్థాయిలో పనిచేసే నాయకుడి వరకు రాబోయే బీజేపీ ప్రభుత్వంలో మంచి అవకాశాలు రాబోతున్నాయని తెలిపారు. పార్టీకోసం పనిచేసే వారిని పార్టీ ఎంతో ఉన్నతమైన స్థానాలకు కల్పిస్తోందనే నమ్మకం ఉందన్నారు. పార్టీని వచ్చే ఎన్నికల నాటిని పూర్తిస్థాయిలో బలోపేతం చేసుకునేందుకు కృషి చేయాలని సూచించారు. పార్టీని కాపాడుకొని పార్టీ కోసం పనిచేస్తే భవిష్యత్ మనదే అని తెలిపారు.

'మున్సిపల్ అధికారుల తీరు సరికాదు'

కొత్తూరు: కొత్తూరు మున్సిపల్ అధికారుల తీరుపై స్థానిక కాంగ్రెస్ నేత వీరమోని దేవేందర్‌ముదిరాజ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా ఆయన శనివారం పట్టణంలో విలేకరులతో మాట్లాడుతూ.. మున్సిపాలిటీ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను అధికారులు ఏమాత్రం అడ్డుకోవడం లేదన్నారు. అక్రమ కట్టడాలను అడ్డుకోవాల్సింది పోయి పరోక్షంగా వారికి సహకరిస్తున్నట్లు ఆరోపించారు. కాగా అనుమతులు పొంది ఆయా నిర్మాణాలు చేస్తున్న ప్రజలను మాత్రం ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆయా వార్డుల్లో ఉన్న అసైన్డ్, సీలింగ్ పొలాల్లో చేపడుతున్న కట్టడాలను ఎందుకు అడ్డుకోవడం లేదని ఆయన అధికారులను ప్రశ్నించారు. మున్సిపల్ అధికారుల తీరు సరికాదన్నారు.

శ్రావణ పూజలకు ఆలయం ముస్తాబు

- రేపటి నుంచి నెలరోజులపాటు సంగమేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు
- ఏర్పాట్లు చేస్తున్న ఆలయ నిర్వాహకులు



ముస్తాబైన సంగమేశ్వర దేవాలయం



ఆలయంలో కొనేరు



గర్భగుడిలో కొలువైన శివయ్య

మొయినాబాద్‌రూరల్: భక్తుల కొంగు బంగారంగా ప్రసిద్ధి చెందిన ప్రకృతి అందాలలో నిర్మించిన సంగమేశ్వర దేవాలయం భక్తులకు ఆహ్లాదాన్ని పంచుతోంది. భక్తుల కోరికలు తీరుస్తూ కొంగుబంగారంగా విరజల్లుతోంది. మండల పరిధిలోని కనక మామిడి సమీపంలో ఈ ఆలయం ఉంది. మూడు ప్రవాహిక వంకల కలయికతోనే ఇక్కడ సంగమేశ్వర దేవాలయం ఏర్పడింది. ఈ ఆలయం 400 ఏళ్ల కింద నిర్మించారు. ఈ ప్రదేశంలో మూడు వాగులు కొండల మధ్య నుంచి ప్రవహిస్తూ ఏర్పడిన పవిత్ర సంగమంతో శివలింగం దర్శనం ఇవ్వడంతో పూర్వీకులు ఇక్కడ ఆలయం నిర్మించారని పేర్కొంటారు. ఈ ఆలయం దాదాపు ఏడు ఎకరాలలో విశాలముగా నిర్మించారు. ఆలయం పక్కనే కోనేరు, తాడిపత్రి చెట్టు ఎకరం స్థలంలో విస్తరించి ఆకర్షనీయంగా నిలుస్తోంది. ఆలయ విశిష్టత త్రివేణి సంగమం వద్ద ఏర్పడిన ఈ సంగమేశ్వర ఆలయంలో గోధుమ రంగులో ఉండే శివలింగానికి మహిమలు ఉన్నాయని అర్చకులు చెబుతుంటారు. అభిషేకాలు చేసే సమయాల్లో ఈ శివలింగం కదులుతుందంటారు. ఇక్కడికి భక్తులు జంట నగరాలతో పాటు వివిధ జిల్లాల నుంచి ప్రతి సోమవారం వేలాదిగా తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించి ముడుపులు కడతారు.

రేపటి నుంచి శ్రావణమాసం ప్రత్యేక పూజలు..

ఆగస్టు నెలలో మొదలయ్యే శ్రావణమాసం మొదటి సోమవారం ఈ నెల 5వ తేదీన ప్రారంభమవుతుంది. దేశంలోనే అమావాస్య ఆదివారం రావడం ఇదే మొదటిసారి అని పూజారులు పేర్కొంటున్నారు. శ్రావణమాసం మొదటి సోమవారం 5వ తేదీన ఉదయం గణపతి హోమం, రుద్రాభిషేకం, రెండో సోమవారం 12వ తేదీన సహస్ర కలశాభిషేకం, మూడో సోమవారం 19వ తేదీన పుష్పార్చన, మహామంగళ హారతి, 4వ సోమవారం 26వ తేదీన అమ్మవారికి శ్రీ చక్ర కుంకుమార్చన నిర్వహిస్తారు. 5వ సోమవారం సెప్టెంబర్ 2వ తేదీన రుద్రాభిషేకం, అన్నపూజ, ఆకు పూజ, మహా మంగళహారతి, భజనలు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శ్రావణమాసం పూజా కార్యక్రమాల్లో భాగంగా నెలరోజుల పాటు సంగమేశ్వర దేవాలయంలో ప్రతిరోజు రాత్రి భజన కార్యక్రమాలు జరుగుతాయని పూజారులు తెలిపారు. ఈ శ్రావణ మాసం నెలలో ఐదు సోమవారాలు రావడం మంచి పరిణామం అని తెలిపారు. ఈ సంగమేశ్వర దేవాలయానికి వచ్చే భక్తులందరికీ అన్నదాన కార్యక్రమంతో పాటు ఆలయంలో ప్రత్యేక పూజలు, తీర్థప్రసాదాలు ఉంటాయని తెలిపారు. నెలరోజుల పాటు జరిగే శ్రావణమాసం పూజలను విజయవంతం చేయలని ఆలయ పండితులు కోరారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి

సీఐ భూపాల్‌శ్రీధర్



మాట్లాడుతున్న సీఐ భూపాల్‌శ్రీధర్

చేవెళ్ల: పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ పాడుపడాలని చేవెళ్ల సీఐ భూపాల్‌శ్రీధర్ అన్నారు. మండల కేంద్రంలోని శ్రీసత్యసాయి గ్రామర్ హైస్కూల్‌లో శనివారం విద్యార్థులు హరితహారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి చేవెళ్లలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవాలయం సమీపంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ భూపాల్‌శ్రీధర్ మాట్లాడుతూ.. మానవ మనుగడకు మూలాధారమైన అడవులను కాపాడి వన్యప్రాణుల సంరక్షణకు మనమెంతో కృషి చేయాలన్నారు. అడవుల అభివృద్ధికి కృషి చేయటంతో పాటు రహదారుల వెంట గ్రామీణ ప్రాంతాల వీధుల్లో ప్రభుత్వ కార్యాలయల్లో పాఠశాలల ఆవరణలో ఎక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే అక్కడే మొక్కలు పెంచాలన్నారు. రాష్ట ప్రభుత్వం కూడా హరితహారాన్ని ప్రోత్సహిస్తూ విరివిగా మొక్కలు నాటాలని సూచిస్తోందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ నల్లా నాయకుడు, ప్రిన్సిపాల్ స్నేహలతశ్రీ, అరుణ్, ఏఓ శివరామ్, మహేందర్‌రెడ్డి, పీఈటీ మల్లేశ్ రాము, నవీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలతో చిన్నారులకు మేలు

చేవెళ్ల సీడీపీఓ శోభారాణి



టీచర్లను సన్మానిస్తున్న సీడీపీఓ శోభారాణి

షాబాద్: అంగన్‌వాడీలతో చిన్నారులకు ఎంతో మేలు జరుగుతుందని, చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు అంగన్‌వాడీ పాఠశాలలు ఎంతో కృషి చేస్తున్నాయని చేవెళ్ల సీడీపీఓ శోభారాణి పేర్కొన్నారు. శనివారం షాబాద్ మండలానికి చెందిన అంగన్‌వాడీ టీచర్లు శకుంతల ఎర్రోనిగూడ, సరస్వతీ కేశవగూడ రిటైర్మెంట్ సందర్భంగా వారిని చేవెళ్లలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ అంటే అమ్మఒడి అని, చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపడానికి, వారికి నడవడికలు నేర్పించడానికి అంగన్‌వాడీలు దోహదపడతాయన్నారు. గత 35 సంవత్సరాలుగా వీరు అంగన్‌వాడీ కేంద్రాలను నిర్వహించారన్నారు. వీరు చేతుల్లో చదువుకున్న విద్యార్థులు ఇప్పుడు ఉన్నతస్థాయిలో ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమాదేవి, టీచర్లు ఉన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్టం

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీబాయి



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీబాయి

నందిగామ: తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీబాయి అన్నారు. మండల పరిధిలోని జంగోనిగూడలో శనివారం అంగన్‌వాడీ టీచర్ సోనీ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీబాయి హాజరై మాట్లాడుతూ.. తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవని, అందులో ఎన్నో రకాలైన పోషకాలు ఉంటాయని వివరించారు. తల్లిపాలు ముద్దు, పోత పాలు వద్దు అని అన్నారు. శిశువు జన్మించినప్పటి నుంచి కనీసం ఆరునెలల వరకు తప్పని సరిగా తల్లిపాలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం రాజ్యలక్ష్మి, మంజుల, మహిళలు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

మనోప్రగతిని సద్వినియోగం చేసుకోండి

ఏపీఎం భగవంతు



బుద్ధిమాధ్యం పిల్లలకు సూచనలు ఇస్తున్న స్పెషలిస్టు

కేశంపేట: మానసిక దివ్యాంగులు మనోప్రగతి క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎం భగవంతు అన్నారు. మండల కేంద్రంలోని దివ్యాంగుల పునఃరావాస కేంద్రంలో శనివారం మనోప్రగతి క్యాంపును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. బుద్ధిమాధ్యం కలిగిన పిల్లలకు ఈ క్యాంపులో పాల్గొనే అధికారులు పలు సూచనలు ఇస్తారన్నారు. అదేవిధంగా దివ్యాంగులకు ప్రభుత్వం అందించే రాయితీ పరికరాలను కూడా అందిస్తారని తెలిపారు. ఈ క్యాంపులో ప్రొఫెషనల్ స్పీచ్ థెరపిస్ట్ సురక్షిత, స్పెషల్ ఎడ్యుకేటర్ కవిత, సీఈసీ నర్సింహ, వసంత, అనిత తదితరులు పాల్గొన్నారు.

ప్రతిష్ఠోత్సవాలను విజయవంతం చేయండి



కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

కొత్తూరు: పట్టణంలో నూతనంగా నిర్మించిన ఆలయాల్లో పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను శనివారం నాయకులు విడుదల చేశారు. ఈ నెల 16 నుంచి 18 వరకు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠలను చేపట్టనున్నట్లు భక్తులందరూ అధిక సంఖ్యలో పాల్గొని ఆయా కార్యక్రమాలను విజయవంతం చేసి అమ్మవార్ల ఆశీస్సులు పొందాలని కోరారు. అదేవిధంగా 22న పోచమ్మ, 23న మైసమ్మ బోనాల జాతరను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు, స్థానికులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూతనివ్వాలి

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి



విరాళాల సేకరణ చేపట్టిన నాయకులు

చేవెళ్ల: కేరళ వరద బాధితులకు ప్రతి ఒక్కరూ చేయూత అందించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి అన్నారు. మండల కేంద్రంలో శనివారం సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మండల కేంద్రంలో తిరుగుతూ.. భారీ వర్షాలకు అక్కడ ఆపదలో ఉన్న వారిని అదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. చేవెళ్ల నియోజకవర్గ పరిధిలో సీపీఐ ఆధ్వర్యంలో ఈ విరాళాల సేకరణ కార్యక్రమాన్ని చేపడుతున్నామని తెలిపారు. తోచిన సహాయం అందించాలని కోరారు. వీటిని తమ పార్టీ తరఫున కేరళ బాధితులకు అందేవిధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆపదలో అండగా నిలబడి వారికి చేయూతనందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎం.సత్తిరెడ్డి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు మంజుల, షాబాద్ మండల కార్యదర్శి జంగయ్య, శంకర్‌పల్లి కార్యదర్శి సుధీర్, కృష్ణగౌడ్, సాయిలు, నర్సింలు తదితరులు ఉన్నారు.

మొక్కజొన్నలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి

కేశంపేట: మొక్కజొన్నలో కత్తెరపురుగు పంటను నాశనం చేస్తుందని, పురుగు నివారణకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి శిరీష అన్నారు. ఈ పురుగు నుంచి పంటను రక్షించుకోవడానికి రైతులు మండల వ్యవసాయ విస్తరణ అధికారుల సూచనలు పాటించాలన్నారు. కత్తెర పురుగునే లద్దె పురుగు అని కూడా అంటారని ఆమె తెలిపారు. ఈ పురుగు ఆరు దశలను కలిగి పంటను నాశనం చేస్తుందన్నారు. కత్తెర పురుగును నివారించేందుకు క్లోరిపైరిఫాస్ 20 ఇసి, 2, 5 మిలీలను లీటర్ నీటిలో కలిపి పంటపైన పిచికారీ చేయాలని సూచించారు. పురుగు ఉధృతి అధికంగా ఉంటే ఇమామెక్టిన్ బెంజోయేట్ పిచికారీ చేయాలని తెలిపారు. మరింత సమాచారం కోసం రైతులు సమీపంలోని రైతు వేదికల్లో ఉండే వ్యవసాయ సిబ్బందిని సంప్రదించాలని ఆమె కోరారు.

స్వచ్ఛదనం-పచ్చదనం విజయవంతం చేయండి

ఎంపీడీఓ సంధ్య



మాట్లాడుతున్న ఎంపీడీఓ సంధ్య



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి రాజరత్నం

మొయినాబాద్‌రూరల్: ఆయా గ్రామాల్లో అధికారులు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీఓ సంధ్య, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డిలు అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించే స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని అందరం కలిసి విజయవంతం చేసేందుకు కృషి చేద్దామని పేర్కొన్నారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వ్యవసాయ అధికారులు, మెడికల్ వెటర్నరీ అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొనాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపడుతుందని తెలిపారు. గ్రామాల్లో అధికారులు ఈ కార్యక్రమాన్ని కార్యాచరణతో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు తారాబాయి, రంజిత్‌కుమార్, కవితకుమారి, ఉమామహేశ్వరి, సంధ్యారాణి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంపొందించడమే లక్ష్యం

కేశంపేట: గ్రామాల్లో పచ్చదనాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛదనం-పచ్చదనం నిర్వహిస్తుందని మండల ప్రత్యేక అధికారి రాజారత్నం అన్నారు. ఈ కార్యక్రమంపై మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం పంచాయతీ కార్యదర్శులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాజరత్నం మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను గ్రామాల్లో మహిళా సంఘాలు, యువతను భాగస్వాములుగా చేసి పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీఓ కిష్టయ్య, మండల వైద్యాధికారి డాక్టర్ నిఖిత, మండల విద్యాధికారి మనోహర్, ఏపీఎం భగవంతు, వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



ఫాగింగ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

షాద్‌నగర్‌రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని విజయ్‌నగర్ కాలనీలో శనివారం మున్సిపల్, వైద్యారోగ్య శాఖ అధికారులు ఫాగింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతను పాటిస్తే వ్యాధులు దరి చేరవన్నారు. దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు.

లబ్ధిదారులకు ఇళ్లు అందజేయాలని వినతి



నయాబ్ తహసీల్దార్ లక్ష్మయ్యకు వినతి పత్రం అందిస్తున్న సాయిబాబా తదితరులు

నందిగామ: గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన డబుల్ బెడ్రూంలను ఎంపిక చేసిన లబ్ధిదారులకు వెంటనే అందించాలని సీపీఎం మండల కార్యదర్శి బీస సాయిబాబ అన్నారు. మండల కేంద్రమైన నందిగామలో డబుల్ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి శనివారం స్థానిక నయాబ్ తహసీల్దారు లక్ష్మయ్యకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సాయిబాబ మాట్లాడుతూ.. నిరుపేదల కోసం, వారికి కనీస గూడు కల్పించాలనే ఉద్దేశంతో గతంలో ఇళ్లను మండల కేంద్రంలో నిర్మించారని, అనంతరం డబుల్ బెడ్రూంల కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారిని ఎంపిక చేసి, గదులను సైతం కేటాయించారని వివరించారు. ఇప్పటివరకు ఇళ్లను అప్పగించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి డబుల్ ఇళ్లను వెంటనే కేటాయించిన వారికి అప్పగించాలని అయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

షాబాద్: ఉచిత వైద్యశిబిరాలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వెల్స్‌పన్ ఫౌండేషన్ జీఎం సురేఖ, ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని చిన్న సోలీపేట్ గ్రామంలో వెల్స్‌పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో భాస్కర్ ఆస్పత్రి, శ్రీబాలాజీ దంత వైద్యశాల మెడికల్ కళాశాల సహకారంతో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో వైద్యులు గ్రామానికి చెందిన మొత్తం 105 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డాక్టర్ సాయికృష్ణ, సాహితీ వైద్యుల బృందం కంటి, కీళ్ల, ఛాతి, చిన్న పిల్లలకు సంబంధించిన వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు



పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

షాద్‌నగర్: మున్సిపాలిటీ పరిధిలోని సోలీపూర్ గ్రామ శివారులో ఉన్న చౌడమ్మగుట్ట హనుమాన్ దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి పల్లకీసేవ ఘనంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు రఘుపతిశర్మ, రాఘవేంద్రాచార్య, కృష్ణ, ప్రమోద్, సునీల్ ఆధ్వర్యంలో పత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పులిమామిడి శ్రీశైలంగౌడ్, భాస్కరాచారి, అంచ రాములు, అన్నారం రఘు, గడ్డమీది రమేశ్, రఘునందన్‌రెడ్డి, క్యాసెట్ శ్రీనివాస్, కిషన్‌నాయక్, రాఘవేందర్, నారాయణ, వీర్లపల్లి కృష్ణయ్య, లక్ష్మీకాంత్‌రెడ్డి, శంకరయ్యయాదవ్, బచ్చన్న, యాదగిరి, ప్రవీణ్‌గౌడ్, పద్మావెంకటేశ్, గోరియానాయక్, సత్తయ్య, హన్మంత్‌రెడ్డి, రవీందర్, సింగపాగ లక్ష్మయ్య పాల్గొన్నారు.



ఆకట్టుకుంటున్న చిక్కుడుపూత

మండల పరిధిలోని పోలారం గ్రామంలో రైతులు సాగుచేస్తున్న చిక్కుడు పంట అందంగా కనిపిస్తోంది. ఆయా తోటల్లో చిక్కుడుపూత తెల్లగా విరబూసి చూపరులను ఆకట్టుకుంటోంది. ఈ దృశ్యం శనివారం సాక్షి కెమెరాకు చిక్కింది. – షాబాద్